## క్లుప్తంగా

### రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌లోని ఉప్పర్‌పల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం దశమి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ వ్యవస్థాపకులు, ఆలయ ధర్మకర్త సామ భూపాల్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన స్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం సుప్రభాత సేవ, విష్వక్సేన పూజ , అభిషేకం, నీరాజన మంత్రపుష్పం, ఋత్విక్ వరణం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, అర్చన, సహస్ర నామార్చన, ఎదుర్కోలు ఉత్సవం, కళ్యాణం, అన్నదానం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### రేపు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ

మణికొండ: మున్సిపాలిటీని వంద శాతం స్వచ్ఛతలో మొదటిస్థానంలో నిలపాలంటే ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఈనెల 11వ తేదీ శనివారం ఉదయం 8గంటలకు మణికొండ మర్రిచెట్టు సర్కిల్ నుంచి పంచవటి కాలనీ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛత, పరిశుభ్రత, పరిపూర్ణ ఆరోగ్య సంరక్షణకు కలసికట్టుగా కృషి చేస్తేనే సాధ్యమవుతుందన్నారు. మున్సిపాలిటీ తరఫున నిర్వహించే ర్యాలీలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరారు.

### ఘనంగా జ్యోతిర్లింగ మహా పడిపూజ



మహాపడిపూజలో పాల్గొన్న భక్తులు

మణికొండ: పుప్పాలగూడలోని శ్రీ మల్లిఖార్జునస్వామి, బీరప్ప స్వామి ఆలయ ఆవరణలో గురువారం శివస్వాముల జ్యోతిర్లింగ మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. గగనగిరి పీఠాధిపతి శిష్యుడు బాల్గిరి మహారాజ్ ఆధ్వర్యంలో మహా పడి పూజ చేశారు. గురుస్వాములు శివ, గణేష్, రాజు, సిద్ధుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శివస్వాములు హాజరయ్యారు. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. పూజలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి. శ్రీరాములు, నాయకులు శ్రావణ్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

### స్లీప్ క్లినిక్ ప్రారంభం

గచ్చిబౌలి: అమర స్లీప్ అవుట్ రీచ్ క్లినిక్‌ను ప్రముఖ దర్శకులు రాఘవేందర్‌రావు గురువారం ప్రారంభించారు. నానక్‌రాంగూడలోని అమరరాజ కార్పొరేట్ ఆఫీస్‌లో అమర స్లీప్ అవుట్ రీచ్ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది. అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరినేని మాట్లాడుతూ పని ఒత్తిడిలో ఉన్న ఐటీ ఉద్యోగులు నిద్రలేమి సమస్యలతో సతమతమవుతుంటారని, ఈ క్రమంలో స్లీప్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.

### డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించాలి

గచ్చిబౌలి: మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు పూణె నమూనా డబుల్ డెక్కర్ (ఒకే పిల్లర్‌పై ఫ్లై ఓవర్, మెట్రో) ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. గచ్చిబౌలి ఔటర్ జంక్షన్‌లో కొండాపూర్ వైపు మల్టీలెవల్ ఫ్లై ఓవర్‌ను ఎప్పుడు పూర్తి చేస్తారో తెలపాలని కోరారు. మియాపూర్‌లోని బొల్లారం చౌరస్తా నుంచి గండి మైసమ్మ వరకు 200 అడుగుల రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, జెఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు విస్తరణ, ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి గాజుల రామారం వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. మంత్రి కేటీఆర్ స్పందిస్తూ రెండవ దశ ఎస్‌ఆర్‌డీపీ పనులకు రూ.4,305 కోట్లతో త్వరలో అనుమతిస్తామని చెప్పారు. కొండాపూర్ ఫ్లైఓవర్‌ను ఆగస్టులో అందుబాటులోకి తీసుకొస్తామని, మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### నేడు హెచ్‌సీయూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ‘నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్’ పై ఒక రోజు జాతీయ సదస్సును శుక్రవారం ఉదయం 9.45 గంటలకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.

# ఎటు చూసినా ఫ్లై ఓవర్లే..

- రూ.1,366.17 కోట్ల వ్యయంతో నిర్మాణం
- తాజాగా లింగంపల్లిలో రూ.180 కోట్లతో ఫ్లైఓవర్‌కు గ్రీన్ సిగ్నల్





శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఫ్లైఓవర్లు ఇవే (ఫైల్)



గచ్చిబౌలి: రాష్ట్రంలోనే అత్యధిక ఫ్లైఓవర్లు ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్‌గా శేరిలింగంపల్లికి గుర్తింపు వచ్చింది. ఇప్పటి వరకు శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో రూ.1,366.17 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్లు నిర్మించారు. దీంతో సాఫీగా రాకపోకలు, ట్రాఫిక్ సమస్య పరిష్కారం, సిగ్నల్ లెస్ ప్రయాణం సాధ్యమైంది. నగరంలో అతిపెద్ద ఫ్లైఓవర్లలో రెండవదైన షేక్‌పేట్- రాయదుర్గం- మల్కంచెరువుపై వంతెన కూడా శేరిలింగంపల్లిలో ఉంది. దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ, రెండు సెంట్రల్ యూనివర్సిటీలు, అతిపెద్ద శిక్షణ సంస్థలు, ఇతర జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఉండడంతో నిత్యం రోడ్లపై రద్దీ విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో పలు ఫ్లైఓవర్లు నిర్మించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.180 కోట్ల వ్యయంతో కొత్తగా లింగంపల్లి కూడలిలో భారీ ఫ్లైఓవర్ మంజూరైంది

**మరిన్నిచోట్ల నిర్మిస్తే మేలు..**

శేరిలింగంపల్లిలో మరిన్ని చోట్ల ఫ్లైఓవర్లు నిర్మిస్తే రాకపోకలు ఈజీ అవుతాయి. ముఖ్యంగా గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ కూడలి, మియాపూర్ బాచుపల్లి వెళ్లే కూడలి, మియాపూర్ ఆల్విన్ కూడలి, మధురానగర్ దాబా కూడలి, నానక్‌రాంగూడ ఐటీ కారిడార్ విప్రో సర్కిల్ వంటి ప్రాంతాలలో ఈ ఫ్లైఓవర్లను నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమవుతాయి.

### సీఎం కేసీఆర్, కేటీఆర్ చొరవతోనే సాధ్యం



ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జిసిటీ, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు కూడా అత్యధికంగా ఉన్నాయి. దీంతో వాహనాల రద్దీ బాగా పెరిగింది. సీఎం ఆదేశంతో మంత్రి కేటీఆర్ చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయడం, అధికారుల తోడ్పాటుతో త్వరితగతిన ఫ్లైఓవర్లు అందుబాటులోకి వచ్చాయి. దీనికితోడు అండర్‌పాస్‌ల నిర్మాణం కూడా చేయడంతో దాదాపు అన్ని చోట్లా ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తున్నాం.

–అరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే

**జంట సర్కిళ్ల పరిధిలో..**

| | | |
|---|---|---|
| గచ్చిబౌలి క్రాస్‌రోడ్స్ ఫ్లైఓవర్ | 0.95 కిలోమీటర్లు | 4 లేను |
| బయోడైవర్సిటీ పార్కు ఫ్లైఓవర్ లెవెల్ | 0 0.9 కిలోమీటర్ | 3 లేన్లు |
| మైండ్‌స్పేస్ ఫ్లైఓవర్ రహేజా మైండ్‌స్పేస్ | 0.83 కిలోమీటర్ | 4 లేన్లు |
| హైటెక్‌సిటీ ఫ్లైఓవర్ | 0.7 కిలోమీటర్ | 4 లేన్లు |
| హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ | 0.7 కిలోమీటర్ | 4 లేన్లు |
| బయోడైవర్సిటీ పార్కు లెవెల్-1 | 0.69 కిలోమీటర్ | 3 లేన్లు |
| గచ్చిబౌలి జంక్షన్ లెవెల్-1 ఫ్లైఓవర్ | 0.8 కిలోమీటరు | 3 లేన్లు |
| దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి | 233 మీటర్లు | 6 లేన్లు |
| షేక్‌పేట్-రాయదుర్గం ఫ్లైఓవర్ | 2.80 కిలోమీటర్లు | 6 లేన్లు |
| లింగంపల్లి ఆర్‌ఓబీ-ఫ్లైఓవర్ | 0.7 కిలోమీటరు | 4లేన్లు |
| హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్-(ఆర్‌ఓబీ) | 0.7 కిలోమీటర్లు | 4 లేన్లు |
| గౌలిదొడ్డి-గోపన్‌పల్లితండా ఫ్లైఓవర్ | కిలోమీటర్ | 4 లేన్లు |
| శిల్పా లేఅవుట్ డైవర్షనల్ ఫ్లైఓవర్ | 2.81 కిలోమీటరు | 4 లేన్లు |

## 11న జర్నలిస్టు అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంట్



టోర్నమెంట్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 11వ తేదీన జరగనున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన లోగోను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గురువారం తన నివాసంలో విలేకరుల సమక్షంలో ఆవిష్కరించారు. 25 సంవత్సరాల నుంచి స్థానిక విలేకరులతో తనకు అనుబంధం ఉందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు అప్పారెడ్డిగూడ భీమయ్య, మేకల దామోదర్‌రెడ్డి, సూర్యనారాయణ, భుజంగరెడ్డి, లక్ష్మణ్ తదితరులున్నారు.

## బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని వినతి



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

రాజేంద్రనగర్: ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం అసోసియేషన్ నాయకులు రాజేంద్రనగర్ డిపో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు పి.వెంకటేష్, గౌరవ అధ్యక్షులు డి.రమేష్‌లు మాట్లాడుతూ శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీ, కృష్ణానగర్, ఫ్రెండ్స్ కాలనీలకు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి పిల్లర్ నెంబర్ 274 వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. నిత్యం నగరంలో రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు పిల్లర్ నెంబర్ 274 వద్ద రోడ్డుపైనే వేచి ఉంటున్నారని ఆ సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అంతే కాకుండా వర్షాకాలం, ఎండా కాలం ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారని సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పి.వెంకటేష్, గౌరవ అధ్యక్షులు డి.రమేష్, ఉపాధ్యక్షులు డి.ఆంజనేయులు, కోశాధికారి బుచ్చిలింగం, కార్యదర్శులు పి.ప్రకాష్‌రెడ్డి, ఎస్.శ్రీధర్, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

## విద్యార్థి దశనుంచే సమాజాన్ని గమనించాలి



ఖానాపూర్‌లో విద్యార్థులతో ఎంజీఐటీ విద్యార్థులు

మణికొండ: విద్యార్థి దశ నుంచే సమాజాన్ని గమనిస్తూ మనల్ని మనం తీర్చిదిద్దుకోవాలని ఎస్‌కే ఎంటర్‌ప్రైజస్ ఎండీ డాక్టర్ పి.కృష్ణ అన్నారు. గండిపేటలోని ఎంజీఐటీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యవస్థాపకత, ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మనం జీవితంలో ఎంత ఎదిగినా మన మూలాలను మర్చిపోవద్దని సూచించారు. మన సంతోషాలను ఇతరులతో పంచుకున్నప్పుడు తృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, ఐఐసీ అధ్యక్షుడు డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీవాణి, కన్వీనర్ డాక్టర్ కెసి సబిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫిరంగి నాలాను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



ఫిరంగి నాలాను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్

శంషాబాద్: పట్టణంలోని 24 వార్డు పరిధిలో ఫిరంగి నాలాను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్‌లు పరిశీలించారు. నాలాలో మురుగునీరు నిలిచిపోతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కౌన్సిలర్ భారతమ్మ, స్థానికుల వినతి మేరకు పరిశీలించారు. శంషాబాద్ నుంచి సాతంరాయి వైపు వెళ్లే ఫిరంగి నాలా పరిశ్రమలున్న ప్రాంతాల్లో కబ్జాకు గురికావడంతో నీరు ముందుకు వెళ్లడం లేదు. దీంతో పట్టణ పరిధిలోనే నీళ్లు నిలిచిపోతున్నాయి. నాలా నీరు ముందుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్, ఆర్‌బీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, పరంధాములు తదితరులున్నారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కమిటీ

- ఏజీ వర్సిటీ వీసీ నీరజ ప్రభాకర్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండ లక్ష్మణ్‌బాపు ఉద్యానవన విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రొఫెసర్స్, విద్యార్థులు, ప్రభుత్వ ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని,దీని ద్వారా విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని విశ్వవిద్యాలయం వీసీ నీరజ ప్రభాకర్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో ఖాళీలను భర్తీ చేయాలని గత 3 రోజులుగా విద్యార్థులు ధర్నా చేస్తున్నారు.దీంతో గురువారం వీసీ విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్, మెస్ కొనసాగుతుందని, విద్యార్థులు ఆందోళన చెందవద్దని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు,మరియు విద్యార్థులతో ఓ కమిటీ వేసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ డాక్టర్ కిరణ్ కుమార్, సీనియర్ సైంటిస్ట్ చిన్నా నాయక్ పాల్గొన్నారు.

### సన్మానం



ప్రతినిధులను సన్మానిస్తున్న పాఠశాల హెచ్‌ఎం రఘుపతి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ తమదైన శైలిలో రాణించడం ఆనందంగా ఉందని మైక్రాన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు అన్నారు. కాగా మైక్రాన్ ఆర్గనైజేషన్ సంస్థ గణేష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లను అందించి ఇన్‌స్ట్రక్టర్ల సాయంతో విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు గురువారం విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ప్రతినిధులను హెచ్‌ఎం శాలువాతో సత్కరించి మొమెంటో అందజేశారు. సీఎస్‌ఆర్ హెడ్ భావన, కృష్ణకుమారి, మాణిక్యంరెడ్డి, గోపాలకృష్ణ, జాన్సన్, సరిత, శ్రీవాణి తదితరులున్నారు.

## ప్రజల చెంతనే బస్తీ దవాఖానలు



నెమలినగర్‌లో బస్తీ దవాఖాన పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: ప్రజల నివాస ప్రాంతాలకు సమీపంలోనే బస్తీ దవాఖానలను ఏర్పాటు చేస్తున్నామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు నెమలినగర్‌లో బస్తీ దవాఖాన భవన నిర్మాణ పనులను ఆయన కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెమలినగర్ ప్రజలు ప్రతి అవసరానికి నార్సింగి, మణికొండలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇప్పటి వరకు ఆసుపత్రి సేవలకు నార్సింగికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. త్వరలోనే పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయి మౌనిక, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు యాలాల నరేష్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి

- మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ



చెరువులోకి వస్తున్న కలుషిత నీటిని చూపుతున్న నాయకులు

మణికొండ: కోకాపేట చెరువులోకి కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు జి.నర్సింహ డిమాండ్ చేశారు. గురువారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట కొత్త చెరువు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోకాపేట చెరువు పక్కనే ఉన్న పరిశ్రమల నుంచి కలుషిత నీరు వచ్చి చేరుతుండడంతో పలుమార్లు లక్షలు విలువ చేసే చేపలు మృతి చెందాయన్నారు. మత్స్యకారుల జీవనోపాధికి గండిపడుతుందన్నారు. స్థానిక సొసైటీకి ఇప్పటి వరకు ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. చెరువును పలు సంస్థలు కబ్జా చేస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆయన ఆరోపించారు. వెంటనే చెరువు కబ్జాలను తొలగించి అందులో కలుస్తున్న మురుగునీటిని అరికట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో కోకాపేట మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షుడు రమేష్, రాయదుర్గం అధ్యక్షుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జేబీఆర్ ఆర్కిటెక్ట్ కళాశాలలో దోషి మెమోరియల్ డే



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆర్కిటెక్ట్ బాలకృష్ణ దోషి జ్ఞాపకార్థం..నగరంలోని జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాలలో గురువారం మెమోరియల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ ఆర్.గాయత్రి జోగనపల్లి, ఇంజనీర్ వేదకుమార్ మణికొండ అధ్యక్షత వహించారు. నగరంలోని ప్రముఖ ఆర్చిటెక్ట్స్, అర్బన్ ప్లానర్స్ ఆర్.సంజీవ్ జోషి, ఆర్.జి.జయకృష్ణన్, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల అధ్యాపకులు, అన్ని సెమిస్టర్స్ విద్యార్థులు హాజరయ్యారు. నగరంలోని ఈసీఐఎల్ హౌసింగ్, టౌన్‌షిప్ ప్రాజెక్టు, సైబరాబాద్ ఆర్కిటెక్చర్ ప్రాజెక్టుల పనితీరుతోపాటు బి.వి.దోషి డిజైన్ ఫిలాసఫీ, నైపుణ్యంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ×లూసియాన్వాలో దోషిపై చిత్రీకరించిన 45 నిమిషాల నిడివి చిత్రం ద్వారా విద్యార్థులకు ఆర్కిటెక్చర్ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. పూర్వ విద్యార్థులు దోషితో తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు.

## గుంతలు..మురుగు




- అధ్వానంగా పద్మశ్రీహిల్స్ రోడ్లు
- ప్రమాదాల బారిన వాహనదారులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీ పద్మశ్రీహిల్స్ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరినా వారు స్పందించడం లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధ్వానరోడ్లు**

సన్ సిటీలోని పద్మశ్రీహిల్స్ కాలనీలో రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ రహదారుల్లో ప్రయాణించడం నరకంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా గుంతలమయంగా మారి కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండాపోయిందని వాపోతున్నారు. ఈ దారిలో ద్విచక్ర వాహనదారులు పలుమార్లు ప్రమాదాల బారినపడ్డారు. సమస్యను పరిష్కరించకపోతే ధర్నా చేపడతామని హెచ్చరించారు.

**ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి...**

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పైపులైన్లు పగిలిపోయి మురుగు నీరు రోడ్లపై పారుతోంది. దీంతో ఈ ప్రాంతమంతా దుర్గంధపూరితంగా తయారైంది. ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.



పద్మశ్రీ హిల్స్ కాలనీలో రోడ్ల దుస్థితి